# గురువును మించిన శిష్య

శ్రీమతి యు. సత్యబాల సుశీలాదేవిగారు

మార్గాయాసంతో, గంగాదాసు ఆ శిథిలదేవాలయపు మెట్లపై చతికిలబడినాడు. క్షుద్బాధతోను, గమనాయాసంతోను అతడి ప్రాణపక్షి ఎగిరిపోదామనే ప్రయత్నిస్తున్నది. అంతలో, ఆ నిర్జనవనపు రమణీయ ప్రకృతీ—సమీపంలోనున్న శిథిలసరోవర నిర్మలజలమూ అతణ్ణి సేదదీర్చాయి. చేతికందినన్ని జామపండ్లు తిని క్షుధానివారణ చేసికొని, పరిసరాలన్ని పరిశీలించేడు. శిథిలదేవాలయంలో ఉజ్జ్వల నారాయణమూర్తిని చూచి అతని భక్తహృదయం ద్రవించిపోయింది; హృదయజ్యోతిని దీపహారతియొనర్చి భక్తిఫలము నివేదించినాడు. మరునాటినుండి అదే అతనివి వాసస్థానమైనది. అనతికాలంలోనే నారాయణుడు శుభ్రాలయవాసియై నిత్యపూజలందుకోసాగాడు.

కాలవాహిని పరువులెత్తినది, ఎండిపోయిన ఆశాలత చిగురించి పూచినది. గంగాదాసుని భక్తి ప్రేమలు, నారాయణుని మహిమ, దశదిశల వ్యాపించినవి. పరిసర ప్రజల రాకపోకలు పూజాభజనలు-పూజారుల మంత్రఘోషలు వనమంతా ప్రతిధ్వని నించినవి. ఆ లయపునర్నిర్మాణముతోబాటు మఠనిర్మాణముకూడ పూర్తియైనది. గంగాదాసు మహంతయినాడు, యికమిగిలినది—మంత్రము - జ్యోతిషము-తాయిత్తులు-రోగనివారణలు; అన్నియు పూర్తియైనవి. శిష్యబృందంకూడా తక్కువకాలేదు—అందుదృఢ భక్తియుతులు లేకపోలేదు.

మూర్తీభవించిన గురుభక్తియే దేవకి-అనాథ-ఉన్న ఒక్కగోవునీ నమ్ముకొని క్షీరవిక్రయమొనర్చి జీవించునది. గురువునే దైవమనీ గురువాక్యములే మంత్రములనీ నమ్మినది. అప్పుడప్పుడు కొలది క్షీరములు గురువునకు కానుకయిచ్చెడిది. గురుపౌర్ణమివచ్చినది; మఠములో కోలాహలమునకు మితిలేదు — గురు పూజకు వివిధములైన ఏర్పాట్లు జరుగుచున్నవి. అపారమైన జనసంతర్పణ. దానికి తగిన పాలు, పెరుగు, నెయ్యి, కూరలు కావలసియున్నవి. అందరూ శక్తివంచన లేకుండావస్తు సేకరణచేస్తున్నారు. క్షీరవిక్రయ మొనర్చునదిగావున కావలసిన క్షీరమంతయు దేవకి తేగలదని గురువు తలంచినాడు. కాని, నిజస్థితిని ఆయన మహంతుపదవి లెక్కగొననీయలేదు. దేవకి ఆలోచించినది. ఆమె స్థూలదృష్టిలో గోవు — అంతర్దృష్టిలో భక్తిదక్క వేరేమియు గోచరింపలేదు. గురువునకేమి సమర్పించగలదు? హృదయధనమంతయు భక్తి ధనముగా నొనర్చి యేనాడో గురువునకు సమర్పించినది. నేడిచ్చునది కేవలంలాంఛనమాత్రమే. కాని ఏమి కలదు; గోమాతగర్భిణి-అది యిచ్చు స్వల్పక్షీరములు అనుదినము కొనువారికే చాలుటలేదు. అయినను వారినే బ్రతిమాలుకొని నాడాకొలది క్షీరములు వారికివ్వక-ఒకశుభ్రకలశంలో భద్రపరచుకొని గురుసన్నిధికి వచ్చినది. తండోపతండములుగ నరుదెంచు జనప్రవాహమును, విరామమెరుంగక, విలువగల కానుక లెన్నియో సమర్పించు శిష్యగణము కన్నులారగాంచి హర్షపులకితయైనది. అందరివెనుక అపరాధినివలె లజ్జావినమ్రతాంగియై-ఆ చిన్నిక్షీర కలశమును గురుపాదములకడనిడి ప్రణమిల్లినది. గురుదేవుని కన్నులు క్రోధారుణిత మొందినవి. నాటి గంగాదాసునందలి భక్తి ప్రేమలు నేటిమహంతుపదవి మహాత్మ్యమున కరుడు గట్టి పోయినవి-వజ్రసన్నిభముకూడనైనవి.

"దేవకీ! ఎంతసిగ్గులేకపోయినది. ఇంత నీచపు కానుక తేగల్గుటకన్న నదిలో ప్రాణమర్పించిన మేలుగానుండెడిదిగదా! క్షీరవిక్రయమొనర్చి జీవించుదానవు· సంతర్పణకైనను క్షీరమీజాలవా, యింత కాఠిన్యమా!" అని తృణీకరించి కసరినాడు.

దేవకి నీరవయై నిలచి గురుముఖము చూచినది, నీరు క్రమ్ముకొనిన కనులను, కొంగున తడియార్చి, మరల పాదములకు మనముననే నమస్కరించినది. గురుపూజకింత హీనమైన కానుక యర్పించుటకన్న నదిలో ప్రాణము లర్పించుట శ్రేయస్కరమను గురువాక్యము స్మరించి శిరసావహించినది.

సుధాధవళమై విరిసిపోవుచున్న వెన్నెల వెలుగులో, యింద్రనీలమై పొంగి పొరలుచున్న యమునా తరంగిణి తళతళ లాడుచున్నది. అంతయు ప్రశాంతసమయము, నిశ్చల చిత్తముతో గుర్వాజ్ఞ నిర్వర్తింపను దేవకి భారయుత నిశ్చల మనంతో నదీతీరానికి వచ్చింది. ఆ ప్రశాంత నిర్మల ప్రకృతిలో ఆ భక్త హృదయం పొంగి పరుగులువారింది.

“ప్రభూ! దయామయా, ఈ నీ నిర్మలమైన విశాలసుందర సృష్టిలో దుఃఖము, ఆవేదన చిరకాలము నిలువరించదు. గురుమూర్తి, బాహ్యమున నీ కనులపడు పేదరికముగాక, అనంతైశ్వర యుక్తమగు భక్తి హృదయము గ్రహించునట్లొనర్పుము స్వామీ!” యని నమస్కరించుచు నదీగర్భమున మునుకవైచినది.

శంకాన్వితముకాని దృఢవిశ్వాసమే మానవుని వున్నతికి సోపానపంక్తి అతీతమైన సుందర దృఢ బాహువులు రెండు దేవకిని లేవనెత్తి ఒడ్డుకు చేర్చినవి. దేవకి కనులు విప్పిచూచినది. నీలనీరదశ్యామలమైన నారాయణుని కోమలవిగ్రహము! — “దేవకీ! భయపడవలదు నీకనంతైశ్వర్యము కావలయునేని చెప్పుము,”

భయసంభ్రమములు, భక్త్యాశ్చర్యములు, దేవకిని ముంచెత్తినవి. గాద్గదికను సవరించుకొని ఎట్లో చెప్పగల్గినది.

“ప్రభూ! నీ యవ్యాజకరుణ, నీ యందలి నిరంతర భక్తికన్న నాకేమీ వలదు.” ఆహా! నిజభక్తుల నిశ్చల హృదయము ధన్యము!

“దేవకీ నీవు వలసినప్పుడెల్ల ఆప్తునివలె పిలచి నా సాయ మపేక్షింపవచ్చును. ఇదుగో! ఈ పాత్రతో నీ గురుని తృప్తినొందింపుము”—వినీల తేజో సౌందర్యరాశి అదృశ్యమై పోయినది.

దేవకి కన్నులమత్తు విడిపోయి, జరిగినదంతయు కలలోవలె స్ఫురణకువచ్చినది. గురుదేవుని దయవలన భగవద్దర్శనమైన దనుకొన్నది! - స్ఫటికవినిర్మలహృదయమది! - మలినమునకు తావులేదు! గురుప్రాంగణమునకు పరుగునపోయినది. “దేవా! ఇవిగో క్షీరములు” — గురువుచూచినాడు — తన తిరస్కృతిపని చేసినది, ఎచ్చటనో క్షీరములసాధించి తెచ్చినదని తలంచి గర్వించి, తలయూచినాడు. కాని ఏ మాశ్చర్యము! మఠమునందలి, రిక్తపాత్రలన్నియు క్షీరభరితములై పోవుచున్నవి. దేవకి చేతిలోని చిన్నపాత్ర నుండి క్షీరధార నిలుచుటయేలేదు! దివ్యవాహినివలె అవిరళమున ప్రవహించుచున్నది. దేవకి జరిగినదంతయు గురువునకు నివేదించినది. గంగాదాసుని దృష్టి వినిర్మలమైనది. కన్నుల ఎదుటి గర్వాంధకారము విరిసిపోయినది. జ్ఞానజ్యోతి తలమెత్తి గతమంతయు యింద్రజాలమువలె ఎదుట స్ఫురింపసాగినది.

“అమ్మా! దేవకీ! నీవే గురుదేవతవు. నన్ను రక్షించి నాకుకూడ నారాయణుని చూపించుమని” సాష్టాంగపడిపోయినాడు. మాయావరణ విడిపోయిన మనుజులయందు మిగులున దంతయు నవనీతము! తన్నవనీతమే శ్యామసుందరుని వాంఛిత వస్తువు.

దేవకి శిరసావహించినది. మరల నదీతీరమునకువచ్చి, దీనాతిదీనయై, గురునికొరకు నారాయణుని ప్రార్థించినది. ఎట్లో సాధించి గురునకు ప్రభుదర్శనము చేయించి తరింపజేసినది. ఇప్పుడింక మహంతుగాని తత్సంబంధమైన అహంకృతికాని మిగిలియుండలేదు. యమున-దేవకి-మఠము-దేవాలయము సర్వత్ర నిండిపోయినవి. సర్వత్రనిండిపోయినది శుభ్రవినీల కాంతి మయమైన నారాయణ స్వరూపమే! ఆ దివ్యానందము లోపించునను భయమున దాసు మరి మఠావరణ త్రొక్కిచూడలేదు - ఆ పవిత్ర యమునా తీరముననే ఒక క్షుద్ర కుటీరమున జీవితశేష మానందమయముగ గడపి నారాయణునియందు లీనమై పోయినాడు.